ఎన్.శివనాగేశ్వరరావు

కథ

# ఒక మంచి కథ


ఆమె నుంచి అటువంటి ప్రపోజల్ వస్తుందని కలలో కూడా ఊహించలేదు. చాలా కాలం తరువాత మనసుకు సంతోషం కలిగింది. శరీరం తెలియని హాయితో దూదిపింజలా తేలికయింది. నరనరాన చైతన్యం, ఏదో చేయాలన్న తపన. ఏం చేయాలో తెలియని అసహాయత.

ఇంతవరకూ నేను రాసింది చదివి ఇదేదో తొలివలపు చేష్ట అని పొరబడకండి. ఎందుకంటే నాది నాలుగు పదుల వయసు. ఆమెది మూడు పదులు దాటిన వయసు. అలాగైతే ఇదేదో కామ ప్రకోపం అని భావించకండి.

ఎందుకంటే ఆమె నాకు రెండేళ్ల నుంచి పరిచయం. మనిషి ఎంతో మంచిది. మచ్చలేని మనిషి అని చెప్పవచ్చు.

ఎర్రటి ఛాయ, విశాల నేత్రాలు, మీగడ తరకల్లాంటి చెక్కిళ్లు, ముత్యాల వంటి పలువరుస, దొండపండు రంగు పెదవులు... నవ్వితే నిర్మలంగా ఉంటుంది. నడక నాజూకుగా ఉంటుంది. నిశ్చయంగా ఆమె అందాలరాశి. అందాన్ని మించి ఆమెలో కనిపించేది హుందాతనం.

ఆమె ఆఫీసులో ఎవరితోనూ అతిగానూ, అనవసరంగానూ మాట్లాడదు. మాట్లాడినంత వరకు మర్యాద ఉట్టిపడుతుంది. కొందరు ఆమె అందం



చూసి 'వల' విసరాలని చూశారు. అయితే ఆమె చాలా తెలివిగలది. వల విసిరిన వారితో ''పై అధికారులకు ఫిర్యాదు చేయగలను. జాగ్రత్త!'' అని హెచ్చరించింది. వాళ్ల మరిక ప్రయత్నం మానుకున్నారు.

ఇక్కడి నా గురించి కూడా రెండు ముక్కలు చెప్పుకోవాలి. ఆఫీసు పని శ్రద్ధగానే చేయడము, ఇంటికి వెళ్లడమే గానీ ఆడవాళ్లను కళ్లతో తినే అలవాటు లేదు నాకు. స్త్రీల పట్ల గౌరవం ఏమాత్రం తగ్గలేదు. ఎందుకంటే అందరూ ఒక్కలా ఉండరన్నది నా సిద్ధాంతం.

మనసు మూగవోయి చాలా కాలం అయింది. అది మరిక రవళించదని నా ప్రగాఢ విశ్వాసం. నా మీద ఆధారపడిన భార్యాబిడ్డలను... వారు ఎటువంటివారయినా... దరిచేర్చాలన్నదే నా లక్ష్యం. అందుకే యాంత్రికంగా బ్రతుకుబండి లాగిస్తున్నాను.

తొలిసారి ఆమెను చూసినప్పుడు మంచి అందగత్తె అనుకున్నాను. మరుక్షణం చూపు మరల్చుకున్నాను. అంతకు మించి ఆమె గురించి నేను ఏనాడూ ఆలోచించింది లేదు. ఆమె నా దృష్టిలో తోటి ఉద్యోగిని. ఆమె గురించి నా ఆలోచనలు అంతవరకే పరిమితం.

ఆమెతో నేను మాట్లాడింది లేదు. నాతో ఆమె మాట్లాడింది లేదు. అటువంటిది ఒక్కసారిగా ఆమె నా దగ్గరకు వచ్చి ''మనం ఏకాంతంగా కలుద్దాం త్వరలో!'' అని చెప్పి వెళ్లిపోయింది.

ఒక్క క్షణం ఆమె ఏం మాట్లాడిందో నాకు అర్థం కాలేదు. మెలమెల్లగా మామూలు మనిషినయ్యాను. ఒక్క క్షణం మా ఇద్దరినీ ఏకాంతంగా ఊహించుకున్నాను. ఎందుకో తెలీదు. చాలా సంతోషం కలిగింది. ఒక్కటి మాత్రం నిశ్చయంగా చెప్పగలను. అది సెక్సువల్ థాట్ కాదు. ఆమె నుంచి నేను ఇంకేదో కోరుకుంటున్నట్లు మనసు అస్పష్టంగా సంకేతాలు పంపుతున్నది. అయితే అదేమిటో నాకు అర్థం కాలేదు.

ఆ సాయంత్రం పార్కింగ్ ప్లేస్ దగ్గర ఉన్న బైక్ తీసుకుని స్టార్ట్ చేయబోతుండగా చల్లని వెన్నెలలా మెల్లగా ఆమె నా దగ్గరకు వచ్చింది. ''మీ ఫోన్ నెంబర్ చెప్తారా?'' అని అడిగింది. ఆమె స్వరం ఎంతో మధురంగా ఉంది. మరలా ఏదో అలౌకికమైన ఆనందం కలిగింది. యాంత్రికంగా ఫోన్ నెంబర్ చెప్పాను. ఆమె మనసులో మననం చేసుకుంది. మరేం మాట్లాడకుండా బయటకు నడిచి ఆటో ఎక్కింది.

నేను ఇల్లు చేరేసరికి చీకటి పడింది. శ్రీమతి, పిల్లలు టీవీ చూస్తూ ఎవరికి నచ్చిన ఛానెల్ వారు చూసేందుకు రిమోట్ కోసం కుస్తీలు పడుతున్నారు.

స్నానం చేసి డాబా మీదకు వెళ్లాను. వెన్నెల పిండారబోసినట్లుంది. చల్లటిగాలి మేను తాకి హాయి గొలుపుతున్నది. మనిషికి ప్రకృతిని మించిన నేస్తం ఎవరు? అక్కడున్న చాప మీద నడుం వాల్చాను. ఆమె గుర్తుకు వచ్చింది. ఒక తీయని భావన హృదయమంతా పరుచుకుంది.

నాతో తెచ్చుకున్న సెల్‌ఫోన్ నుంచి పాతపాటలు వినడానికి 'ప్లే' బటన్ నొక్కాను. 'మనసున మనసై, బ్రతుకున బ్రతుకై, తోడొకరుండిన అదే భాగ్యము... అదే స్వర్గము' పాట వినవస్తున్నది. ఎన్నిసార్లు విన్నా మరలా వినాలనిపించే పాట. నిజంగా అటువంటి తోడు దొరికితే ఎంత బాగుంటుంది! అలా ఎన్ని వేల సార్లు అనుకుని ఉంటానో?

అంతలో సెల్‌ఫోన్‌లో మెసేజ్ వచ్చినట్లు బీప్ సౌండ్ వచ్చింది. ఎవరు పంపారా? అని సెల్ తీసి చూశాను. ఆ ఫోన్ నెంబర్ కొత్తగా అనిపించింది. మెసేజ్ మాత్రం హృదయానికి హత్తుకునేట్లు ఉంది. 'ఒకటి ఎప్పుడూ ఒంటరే. మరొకటి జత చేరితే అది రెండు. అదే నిండు. మరి జత చేరిన ఒకటి హృదయానికి హృదయం చేర్చేదయితే అది అపూర్వం... అనిర్వచనీయం'

అంత మంచి మెసేజ్ ఎవరు పంపించి ఉంటారా? అని ఆలోచించాను. ఆమె గుర్తుకు వచ్చింది. సాయంత్రం ఫోన్ నెంబర్ తీసుకుంది. తప్పక ఆమే చేసి ఉండాలి అనుకున్నాను. ఆమెకు ఫోన్ చేసి మాట్లాడాలనిపించింది. బలవంతంగా నిగ్రహించుకున్నాను.

శ్రీమతి పాప చేత భోజనం డాబా పైకి పంపించింది. అది ప్రేమతో పెట్టిన భోజనం కాదు. మొక్కుబడి భోజనం. మనసు బాధతో నిట్టూర్చింది. ''నువ్వు తిన్నావా? పాపా?'' అని అడిగాను. ''తినలేదు'' పాప తుర్రున వెళ్లిపోయింది.

భోజనం చేస్తుంటే ఆమె మరలా గుర్తుకు వచ్చింది. ఎందుకో తెలీదు. ఆమె నాకు అన్నం ముద్దలు తినిపిస్తున్న దృశ్యం కళ్లముందు కదలాడింది. హృదయంలో సన్నటి కదలిక.

ఆకాశంలో చంద్రుడు మబ్బుల చాటుకు వెళ్లాడు. సన్నటి చీకటి ఆవరించింది. కొద్ది క్షణా

## ఇషా సెకండ్ ఇన్నింగ్స్

చంద్రలేఖ లాంటి ఒకటి రెండు తెలుగు చిత్రాలతోపాటు తమిళ, హిందీలలో దాదాపు 40 చిత్రాల వరకూ చేసి ఆమధ్య తన బాయ్‌ఫ్రెండ్‌ని పెళ్లాడింది ఇషా కొప్పీకర్. పెళ్లయి ఏడాది ఇంకా దాటకుండానే సినీకెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ని ఆరంభిస్తోంది ఇషా. సుభాష్ ఘయ్ నిర్మిస్తున్న కొత్త చిత్రం 'హలో డార్లింగ్'లో ముఖ్యపాత్ర పోషిస్తోంది. తను సినిమాల్లో నటించడంపై తన భర్తకి ఎలాంటి అభ్యంతరాలూ లేవని అందుకనే తిరిగి సినిమాల్లో నటిస్తున్నట్టు చెబుతోంది ఇషా.



లకు మరలా వెన్నెల వచ్చింది. నేర్చుకుంటే ప్రకృతి నుంచి ఎన్ని పాఠాలు? అనుకున్నాను.

తెల్లవారింది. ఆఫీసుకు బయలుదేరాను రోజులా రొటీన్‌గా అనిపించలేదు. ఉత్సాహంగా అనిపించింది. ఆఫీసు చేరాను. సీటులో కూర్చుని ఆమె కోసం చూశాను. కనిపించింది. నన్ను చూసిచిన్నగా నవ్వింది. ఆ నవ్వు హృదయంలో పారిజాతాలు కురిపించింది.

లంచ్ చేస్తుండగా నా దగ్గరకు వచ్చి ''నేను చేసిన స్వీట్ తినండి'' అని ఒక స్వీట్ అందించింది. ఆమె నాకు దేవతలా కనిపించింది. దేవత తన చేత్తో స్వయంగా ప్రసాదం అందించిన అనుభూతి కలిగింది.

స్వీట్ తిని ''చాలా బాగుంది'' అని చెప్పాను.

''థేంక్యూ!'' అని చిన్నగా నవ్వి కనుమరుగయింది.

నెల రోజులు గడిచాయి. ఆమె ఏదో ఒక రూపేణా పలకరిస్తున్నది. ప్రేమ కురిపిస్తున్నది. అయితే నేను ఏం అడ్వాన్స్ కాలేదు. నా పరిధిలో నేనున్నాను. ఆమె ప్రేమను మాత్రం ఆస్వాదిస్తున్నాను.

ఆమె నుంచి మంచి మెసేజ్‌లు వస్తున్నాయి. అవి నాకు ఉత్తేజాన్ని ఇస్తున్నాయి.

అంతకాలం నా మనసును ఆవరించిన చీకటి మెలమెల్లగా మాయం కాసాగింది. మనసులోని ఉత్సాహం శరీరానికి కూడా పాకి నిస్సత్తువ మాయం కాసాగింది.

చాలా కాలం తరువాత లోకం కొత్తగా కనిపించసాగింది. జీవితం మీద ఆసక్తి కలగసాగింది.

మెలకువలోనూ, స్వప్నంలోనూ ఆమె నన్ను చూసి నవ్విన నవ్వులు పువ్వులు పూయిస్తూనే ఉన్నాయి. ఆమెతో మాట్లాడాలనిపిస్తున్నది. కానీ మౌనమే బాగుందనిపించింది. ఆ ప్రయత్నం మానుకున్నాను.

ఒక రోజు ఆఫీసులో ఎవరూ లేని సమయంలో ఆమె నా దగ్గరకు వచ్చింది. ''మీకో చిన్న గిఫ్ట్'' అని చిన్న ప్యాకెట్ అందించింది.

''ఎందుకు?'' అని అయోమయంగా అడిగాను.

''ఎందుకేంటి? ఈ రోజు మీ పుట్టినరోజు. మరచిపోయారా? మీకు హృదయపూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియబరుస్తున్నాను'' అన్నదామె.

''నా పుట్టినరోజు నేను మరచిపోయి చాలా కాలం అయింది'' చిన్నగా గొణిగాను.

''తెలుసు. అది గుర్తుచేయాలన్నదే నా కోరిక'' ఆమె నా చేతిని తన చేతిలోకి తీసుకుని కరచాలనం చేసి వెళ్లిపోయింది.

నా తపస్సుకు కరుణించి దేవత ప్రత్యక్షమై, వరమిచ్చి మాయం అయినట్లనిపించింది. చాలాసేపటి వరకూ అలానే ఉండిపోయాను. తరువాత మెల్లగా ప్యాకెట్ తెరిచి చూశాను. అందులో ఒక పెన్ ఉంది. అది చూడముచ్చటగా ఉంది. తెల్లకాగితం మీద ఆ పెన్‌తో ఆమె పేరు రాశాను. ఆ అక్షరాలు తాకుతుంటే ఆమెను తాకిన అనుభూతి కలిగింది. మనసు పరవశించింది.

ఆమె ఎందుకు పెన్ ప్రెజెంట్ చేసి ఉంటుంది? అని ఆలోచించాను. అర్థం కాలేదు ఎందుకో తెలీదుగానీ చాలా కాలం తరువాత కథ రాయాలనిపించింది.

అన్నట్లు మీకు చెప్పడం మరచిపోయాను. ఒకప్పుడు నేను రచయితను. వందలకొద్దీ కథలు రాశాను. ఎంతోమంది అభిమానులు ఉండేవారు. జీవితం ఎంతో ఉత్సాహంగా... ఉల్లాసంగా... ఉండేది ఏదో సాధించాలన్న తపన ఉండేది.

పెళ్లయింది. నన్ను అర్థం చేసుకోని జీవితభాగస్వామిని వచ్చాక ఉత్సాహం చల్లారిపోయింది. మెల్లగా నిర్లిప్తత చోటు చేసుకుంది. జీవితం యాంత్రికం అయిపోయింది. కథలు రాసే మూడ్ పోయింది.

అటువంటిది ఆమె ప్రేరణతో మరలా కథ రాయాలనిపించింది. అంతేగానీ రాసే శక్తి మాత్రం రాలేదు. అయితే ఆమె ప్రెజెంట్ చేసిన పెన్ మాత్రం సదా నా షర్ట్ జేబులో ఉంచుకోసాగాను. ఆమె నాతోనే ఉన్న ఫీలింగ్ కలిగేది.

జీవితంలో నాకు కాసింత సంతోషాన్ని పంచిన ఆమె పట్ల కృతజ్ఞతాభావం పెరిగిపోసాగింది. మనసు కోవెలలో ఆమె దేవతగా నిలిచింది.


నెలలు తిరిగాయి. ఒకసారి ఆమె నా దగ్గరకు వచ్చి ''రేపు సాయంత్రం మా ఇంటికి రాగలరా? ఏకాంతంగా కొద్ది క్షణాలు గడుపుదాము'' అన్నది.

ఆమె అంత సూటిగా అడిగేసరికి తడబడ్డాను. ఔను, కాదులకు మధ్యస్తంగా తల పంకించాను. ఆమె ప్రేమగా నవ్వి వెళ్లిపోయింది.

ఆ రాత్రి నాకు నిదుర కరువైంది. ఆమె ఆలోచన ఏమై ఉంటుంది? ఏకాంతంలో ఏం మాట్లాడుతుంది? ఎలా ప్రవర్తిస్తుంది? ఒకవేళ కౌగిలించుకుని ముద్దులు పెడుతుందా? హొయలు కురిపించి... మైమరిపించి... నాలోని కోరికను రెచ్చగొడుతుందా? ఎందుకో అది నాకు సంతోషంగా అనిపించలేదు. అలా జరగకూడదని కోరుకున్నాను. ఆమె ఎందుకు ఆహ్వానించిందో తెలుసుకోవాలన్న కుతూహలం పెరిగింది.

తెల్లవారింది. మనిషిని ఇంటి దగ్గర ఉన్నానుగానీ మనసు మాత్రం ఆమె సన్నిధిలో విహరించసాగింది.

క్షణాలు భారంగా అనిపించాయి. సాయంత్రం అయింది. ఫ్రెష్‌గా స్నానం చేసి బ్లూ ప్యాంట్ మీద వైట్ షర్ట్ టక్ చేశాను. షర్ట్ జేబులో ఆమె



## రీఎంట్రీ ఎప్పుడు?

**బోనీకపూర్ తన రెండో భార్య శ్రీదేవి రెండో ఇన్నింగ్స్‌ని భారీగా ఆరంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడని కొంతకాలంగా వినిపిస్తూనే వుంది. అయితే శ్రీదేవి రీఎంట్రీ సంగతేమోగానీ ఈలోగా బోనీకపూర్ మొదటి భార్య మోనా కుమారుడు అర్జున్ కపూర్ మాత్రం హీరోగా తెరంగేట్రం చేసేలా వున్నాడని బాలీవుడ్ సమాచారం. 24 ఏళ్ల అర్జున్ హీరోగా బోనీకపూర్ ఓ చిత్రం నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నాడట. మరి ముద్దుల భార్య శ్రీదేవిని కొంత కాలం ఆగమంటాడేమో రీఎంట్రీకి. లేదా ఆమె కోసం కూడా ఓ సినిమా తీస్తాడేమో చూడాలి.**

ప్రెజెంట్ చేసిన పెన్ పదిలంగా ఉంచాను.

ఎన్నడూ లేనిది ఆదివారం బయటకు వెళ్తుంటే ''ఎక్కడికి?'' అన్నట్లు శ్రీమతి ఆరాగా చూసింది. ''నేను ఎప్పటిలా భయపడలేదు. బయటకు నడిచాను. బైక్ మీద వెళ్తూంటే దేవాలయానికి బయలుదేరిన ఫీలింగ్ కలిగింది. మరి దేవతకు కానుక తీసుకు వెళ్లాలా? అన్న ఆలోచన వచ్చింది.

బాగా ఆలోచించి సండే మార్కెట్‌లో ఒక పెయింటింగ్ కొన్నాను. అందమైన ప్రకృతి మధ్య ఒక చిన్న పక్షి స్వేచ్ఛగా... సంతోషంగా ఎగురుతున్నది.

ఆమె చెప్పిన గుర్తుల ప్రకారం ఆమె ఇల్లు చేరాను. బైక్ స్టాండ్ వేసి వెళ్లి కాలింగ్ బెల్ నొక్కాను.

''ఆమె భర్త వచ్చి తలుపు తీతుడి కదా!'' అన్న అనుమానం వచ్చింది. కానీ అలా జరగలేదు. ఆమె వచ్చి తలుపు తీసింది. నన్ను చూసి ప్రేమ మయం నవ్వి'' లోనికి ఆహ్వానం అంది. ఆమె నుంచి వస్తున్న పరిమళం ఎంతో బాగుంది. మెల్లగా లోనికి అడుగిడాను.

''కూర్చోండి'' సోఫా చూపించింది. నేను తెచ్చిన పెయింటింగ్ అందించాను. తీసిచూసి 'బాగుంది' అని కాంప్లిమెంట్ ఇచ్చింది.

ఇల్లు చిన్నదే అయినా అందంగా... పొందికగా ఉంది. ఆమె అభిరుచికి మనసులో మెచ్చుకున్నాను.

కిచెన్‌లోకి వెళ్లి కప్పుతో కాఫీ తెచ్చి అందించింది.

ఏదో మాట్లాడాలి కాబట్టి ''మీ గురించి నాకంతగా తెలియదు'' అన్నాను.

''తెలియటానికి ఏముంది? మా వారు నేవీలో పని చేస్తుంటారు. ఇంకా పిల్లలు లేరు'' అన్నదామె మెల్లగా.


''నాకు ఇద్దరు పిల్లలు. పాప, బాబు'' అని చెప్పాను.

''తెలుసు'' అన్నదామె.

కొద్ది క్షణాలు ఇద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది.

ఆమె ఒక ఆల్బమ్ అందించింది. అందులో ఆమె, ఆమె భర్త ఉన్న ఫోటోలు చాలా ఉన్నాయి. అతను అందంగా ఉన్నాడు. ఇంత అందమైన భర్త ఉండగా నా పట్ల ఎందుకంత శ్రద్ధ చూపిస్తున్నదా? అనుకున్నాను.

నా ఆలోచనలు చదివినట్లు ''అతడు అందగాడే గానీ మనసున్న వాడు కాదు. శాడిస్ట్. నా శరీరాన్ని బాగా చూసుకుంటాడు. మనసుకు మాత్రం




చిత్రహింసలు పెడుతుంటాడు'' అన్నది. ఆమె కన్నుల్లో దిగులు కనిపించింది. నీకు నా మనసు ఎరిగి ప్రవర్తించని నా భార్య గుర్తుకు వచ్చింది. చిన్నగా నిట్టూర్చాను.

''ఇల్లు చూద్దురు రండి'' అని ఆహ్వానించింది.

''ఫర్లేదు'' అన్నాను.

ఆమె నా దగ్గరకు వచ్చి నా చేతిని తన చేతిలోకి తీసుకుంది. మంత్రముగ్ధుడిలా ఆమె వెంట నడిచాను. కిచెన్ నీట్‌గా ఉంది. పూజామందిరం పరిమళ భరితంగా... పవిత్రంగా కనిపించింది. తరువాత బెడ్‌రూమ్‌కి తీసుకు వెళ్లింది.

డబుల్‌కాట్ మీద పరిచిన నీలంరంగు బెడ్‌షీట్ మడత నలగకుండా మురిపెంగా ఉంది. టీపాయ్ మీద ఉన్న ఫ్లవర్ వాజ్‌లో ఉంచిన పూలు నుంచి సువాసనలు గుబాళిస్తున్నాయి. గోడకు తగిలించిన ఆయిల్ పెయింటింగ్ ఆమె అభిరుచికి అద్దం పడుతున్నది. కిటికీలోంచి గులాబీ మొక్కలు కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి.

''కూర్చోండి'' ఆమె బెడ్ చూపించింది.

నా మనసులో చిరుభయం చోటు చేసుకుంది. ఆమె నా నుంచి ఏం కోరుకుంటున్నది? శారీరక కలయికా? అది నాకిష్టం లేదు. ఎందుకంటే ఆమె నా దృష్టిలో దేవత. ఆ దేవత పరమపవిత్రంగా అలాగే ఉండాలి. మలినం కాకూడదు అనిపించింది.

ఆమె బెడ్ మీద కూర్చుని నన్ను తన పక్కన కూర్చోబెట్టుకుంది. మెల్లగా నా తలను తన ఒడిలోకి తీసుకుంది. మెల్లగా నా నుదుటి మీద ముద్దు పెట్టింది. ఆకాశం అందుకున్న ఫీలింగ్ కలిగింది. అలౌకిక ఆనందానికి లోనయ్యాను. చిన్నతనాన అమ్మ అచ్చం అలానే నన్ను ముద్దాడేది. ఆమె కన్నుల్లోకి చూశాను. ఆ కన్నుల్లో సన్నటి తడి.

ఆమె చెప్పడం ప్రారంభించింది. ''మీ కష్టాలు నాకు తెలుసు. ఎలా తెలుసని అడగకండి. ఎదుటి మనిషి మన మనిషి అనుకుంటే ఏమైనా చేయవచ్చు. ఏదైనా తెలుసుకోవచ్చు. మీ మానసు మూగబోయింది. మీకు మంచి తోడు లేదు. మీ మనసుకు గాయం అయింది. ఆ మనసును సాంత్వనపరచాలన్నదే నా తపన.

మీకు తెలియని మరొక సంగతి ఉంది. గతంలో నేను మీ కథలు అన్నీ చదివేదాన్ని. నేను మీ అభిమానిని. ఆఫీసులో చేరినప్పుడు ఆ రచయిత మీరేనని తెలీదు. మెల్లగా తెలిసింది. మీలోని నిరాసక్తత గమనించాను. మీ గురించి వాకబు చేశాను. నిజాలు తెలిశాయి. మీరెందుకు కథలు రాయడం లేదో అర్థమైంది. మూగబోయిన మీ మనసు రవళించాలి. మీలోని రచయిత జాగృతం కావాలి. మీరు కష్టాలు అనుభవించవచ్చు. కానీ మరెందరో కథల వలన స్ఫూర్తిని పొందగలరు. మనకంటే జనం ముఖ్యం. జనహితం ముఖ్యం''

ఆమె మాటలు మంత్రముగ్ధునిలా వింటున్నాను. దేవలోకంలోని దివ్య స్వరాలు నా హృదయంలో రవళిస్తున్నాయి. నరనరాన చైతన్యం అలుముకుంటున్నది.

ఆమె స్పర్శ నా శరీరానికి మనసుకి ఎంతో శక్తినిస్తున్నది. కళ్లు మూసుకుని చాలాసేపు అలానే ఉండిపోయాను. ఆమె అలా నా తల నిమురుతూనే ఉంది. కొద్ది క్షణాలు ఆ దివ్యానుభూతిని పొందాక మెల్లగా పైకి లేచాను.

''పరిమళం శరీరానికే కాదు మనసుకూ ముఖ్యం. అది ఎంతో ప్రేరణనిస్తుంది. మీ మనసుకు పరిమళం అద్దే ప్రయత్నమే నాది'' అన్నదామె.

''మీకు కృతజ్ఞతలు. జీవితాంతం వరకూ సరిపడ శక్తినిచ్చారు. మీరు కానుకగా ఇచ్చిన కలం మరిక ఖాళీగా ఉండదు'' అన్నాను.

''మీ నుంచి ఒక మంచి కథ ఆశిస్తున్నాను. ఎందుకంటే ఒకసారి కదిలిన కలం మరిక ఆగదు'' అన్నదామె.

చిన్నగా చేతులు జోడించి ఆమెకు నమస్కరించాను. ఆమె నా చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా ముద్దాడి ''కొత్త జీవితానికి స్వాగతం పలకండి. బెస్టాఫ్ లక్'' అన్నది.

ఇల్లు చేరాను. ఒక మంచి కథ కోసం ఆలోచించాను. ఆలోచిస్తే అనిపించింది... 'మా కథ కంటే మంచి కథ ఏం ఉంటుందా' అని.

ఆమె కానుకగా అందించిన కలం అందుకుని కథకు శ్రీకారం చుట్టాను. నేను చుట్టిన శ్రీకారం చుట్టూ ఓంకారంలా ఆమె కనిపించింది.

విశ్వం నాదనిపించింది.